# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-01-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ఒకే దేశం.. ఒకే ఎన్నిక వల్ల దేశానికి ఎంతో మేలు జరుగుతుందని.. సుపరిపాలనకు కొత్త నిర్వచనాన్ని ఇస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు.**

**2. కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ఏడుగురిని పద్మ విభూషణ్, 19 మందిని పద్మ భూషణ్, 113 మందిని పద్మ శ్రీ పురస్కారాలకు ఎంపిక చేసింది.**

**3. అర్హులందరికీ ఇళ్లు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారథి తెలిపారు.**

**4. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ప్రారంభించనుంది.**

**5. ప్రజాస్వామ్య వ్యవస్థలో భారత ఎన్నికల సంఘం పాత్ర విశిష్టమైనదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు.**

==========================

ఈ ఏడాది గణతంత్ర వేడుకలను 'స్వర్ణమయ భారత్ వారసత్వం, వికాసం' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు ప్రత్యేక అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో హాజరవుతున్నారు. ఆయన ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. మరోవైపు, పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 16 శకటాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, విభాగాలు, సంస్థల నుంచి మరో 15 శకటాలను ప్రదర్శన కోసం ఎంపిక చేశారు.

రక్షణ శాఖ తొలిసారి తన సాయుధ పాటవాన్ని చాటుతూ బ్రహ్మోస్, పినాక, ఆకాశ్ వంటి విధ్వంసక క్షిపణులను, యుద్ధ నిఘా వ్యవస్థ 'సంజయ్'ను ప్రదర్శించనుంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ.. డీఆర్‌డీవో ఉపరితలం పైనుంచి ఉపరితలం దాకా లక్ష్యాన్ని ఛేదించేలా రూపొందించిన 'ప్రళయ్'ను ప్రదర్శించనుంది.

కాగా.. త్రివిధ దళాల బంధానికి ప్రతీకగా రూపొందించిన త్రివర్ణ శకటాన్ని ఈ కవాతులో తొలిసారి భాగం చేశారు. ఈ శకటానికి 'శక్తివంతమైన, సురక్షితమైన భారత్'అని పేరుపెట్టారు. ఈ సారి రిపబ్లిక్ వేడుకల్లో 352 మంది ఇండొనేషియాకు చెందిన బ్యాండ్ బృందం ఆకర్షణగా నిలువనుంది.

--------------------------

ఒకే దేశం-ఒకే ఎన్నిక విధానం వ్యవస్థలో వైఫల్యాలను నివారించే మార్గమని, పాలనలో సుస్థిరతతో

పాటు, ఖర్చు భారాన్ని తగ్గిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిన్న ఆమె జాతినుద్దేశించి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటోన్న సాహసోపేత సంస్కరణల ద్వారా ఉత్తమ ఫలితాలు రాబోతున్నాయన్నారు. ముఖ్యంగా ఆర్థిక పురోగతి కారణంగా దేశంలో పేదరికం తగ్గుముఖం పట్టిందని తెలిపారు. సుసంపన్న, సమ్మిళిత భారత్ సాకారానికి పౌరులందరూ పునరంకితం కావాలని రాష్ట్రపతి పిలుపునిస్తూ…

…వాయిస్..32 సెకన్లు

---------------------------

ప్రత్యేకమైన గణతంత్ర దినోత్సవం రోజున జాతి నిర్మాణానికి పునరంకితమయ్యేలా ప్రతిజ్ఞ చేద్దాం అని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో నిన్న ఆయన సందేశమిచ్చారు. స్వాతంత్ర్య సమర యోధుల స్ఫూర్తితో సత్యం, అహింస, శాంతి, సౌభ్రాతృత్వం అనే ఉదాత్తమైన ఆదర్శాలకు పునరంకితమవ్వాల్సిన రోజు ఇది అని తెలిపారు. ఆ సమరయోధుల త్యాగాల కారణంగానే ఈ రోజు స్వాతంత్ర్య ఫలాలు పొందగలుగుతున్నామని గవర్నర్ పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధమైంది. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే గణతంత్ర వేడుకలకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, పలువురు మంత్రులు హాజరుకానున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన.. పోలీసులు, ప్రత్యేక బలగాల కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. కాగా.. గణతంత్ర వేడుకల సందర్భంగా ఇందిరాగాంధీ స్టేడియం మీదుగా వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నామని విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వాహనాలను మళ్లిస్తున్నామని.. ప్రజలు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

---------------------------

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు ప్రారంభించనుంది. హైదరాబాద్ నగరం మినహా మిగిలిన 606 మండలాల్లోని ఒక్కో గ్రామంలో నాలుగు పథకాలకు అర్హులైన లబ్ధిదారులందరికీ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈ రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు పథకాల ప్రారంభోత్సవం జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల వరకు పంపిణీ జరుగుతుంది. నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పథకాలను ప్రారంభించనున్నారు.

---------------------------

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ‘పద్మ’ పురస్కారాలను ప్రకటించింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ఏడుగురిని పద్మ విభూషణ్, 19 మందిని పద్మ భూషణ్, 113 మందిని పద్మ శ్రీ పురస్కారాలకు ఎంపిక చేసింది. తెలంగాణ నుంచి వైద్య విభాగంలో డాక్టర్ దువ్వూరు నాగేశ్వర్‌రెడ్డికి పద్మవిభూషణ్.. ఆంధ్రప్రదేశ్ నుంచి కళల విభాగంలో సినీనటులు నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారాలు ప్రకటించింది.

ఆంధ్రప్రదేశ్ నుంచి విద్య, సాహిత్య రంగాల్లో కేఎల్ కృష్ణ, వి.రాఘవేంద్రాచార్య పంచముఖి, కళా రంగంలో మాడుగుల నాగఫణిశర్మ, మిరియాల అప్పారావును మరణానంతరం, తెలంగాణా నుంచి ప్రజా వ్యవహారాల్లో మంద కృష్ణ మాదిగను పద్మ పురస్కారాలకు ఎంపిక చేసింది.

---------------------------

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారథి తెలిపారు. విజయవాడలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తరువాత లక్షా 14 వేల ఇళ్లు నిర్మించామని వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం తేతలిలో ఫిబ్రవరి 1వ తేదీన ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేస్తామని మంత్రి పార్థసారథి వివరిస్తూ...

… వాయిస్..38 సెకన్లు

---------------------------

దేశ భవిష్యత్తుకు ఓటే ఆయుధమని, ప్రజాస్వామ్య వ్యవస్థలో భారత ఎన్నికల సంఘం పాత్ర విశిష్టమైనదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిన్న నిర్వహించిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలనే ఓటర్ల ఉత్సాహం ఆరోగ్యకర ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమని అన్నారు. ఈ సందర్భంగా గత సార్వత్రిక ఎన్నికల్లో సమ ర్థవంతంగా విధులు నిర్వర్తించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎన్టీఆర్, కృష్ణాజిల్లా కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీతో పాటు వివిధ హోదాల్లో ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సహా 158 మంది అధికారులకు ఉత్తమ ఎన్నికల నిర్వహణ పురస్కారాలు అందజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ముందు అధికారంలోకి రావడానికి హామీలు ఇచ్చిన కూటమి నేతలు ఇప్పుడు వాటిని అమలు చేయమంటే అప్పులు ఉన్నాయంటూ దాటవేత ధోరణిని అవలంభిస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. సూపర్ సిక్స్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో నిన్న ధర్నా నిర్వహించారు.

======================